క్లుప్తంగా

వాహనం ఢీ కొని వ్యక్తి మృతి



సోమందేపల్లి: మండల కేంద్రంలోని క్రీస్తుజ్యోతి పాఠశాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలాజీనగర్‌కు చెందిన వెంకటరాముడు(50) అనే వ్యక్తి మృతి చెందాడు. రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం అతడిని ఢీ కొట్టింది. తలకు తీవ్ర గాయాలై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేవాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సచివాలయ భవనం పరిశీలన

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆ శాఖ డీఈ మల్లికార్జున సూచించారు. గురువారం మండలంలోని మద్దనకుంట గ్రామ సచివాలయం భవన నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెలఖారులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

కంచిసముద్రంలో దీపోత్సవం



బ్రహ్మచైతన్య స్వామికి పూజలు చేస్తున్న మహిళలు

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం గ్రామంలో గోందావళి సద్గురు బ్రహ్మ చైతన్య స్వామి 110వ ఆరాధన సందర్భంగా గురువారం ఉదయం మహిళలు దీపోత్సవం నిర్వహించారు. తొలుత స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వెళ్లి స్వామికి సమర్పించారు. అలాగే ఏకాదశవార రుద్రాభిషేకం, గోమాత పూజ, సహస్రనామ పూజ, తారకమంత్ర జపం, నవగ్రహ జపము, సూర్యప్రార్థన తదితర పూజలు ఘనంగా జరిగాయి. శుక్రవారం బ్రహ్మరథోత్సవం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

ఇంటింటికీ అక్షింతల వితరణ

రొళ్ల: మండలంలోని సోమఘట్ట గ్రామంలో గురువారం అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలను ధర్మ రక్షా సమితి సభ్యులు ఇంటింటికీ వెళ్లి వితరణ చేశారు. అక్షింతలతో పాటు శ్రీరాముని చిత్ర పటం, ఆహ్వాన పత్రిక, హనుమాన్ జెండాను భక్తులకు వితరణ చేశారు. హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు మాట్లాడుతూ అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామమూర్తి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన చేస్తారన్నారు. అదే రోజు ప్రతి ఇంట్లో విశేష పూజలు చేసి జ్యోతులు వెలిగించి , అక్షింతలను స్వామి చిత్రపటంపై వేసి స్మరించుకోవాలన్నారు. హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం



పరిగిలో ర్యాలీ ప్రారంభిస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

పరిగి: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దారు సౌజన్యలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దారు ఆధ్వర్యంలో ఓటరు నమోదు, ఆవశ్యకత అన్న అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత కార్యాలయం నుంచి పురవీధుల్లో విద్యార్థులు, పుర ప్రముఖులు, ఉపాధ్యాయులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి, ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఓటు హక్కు విలువపై ప్రతిజ్ఞ చేయించారు. డీటీ లక్ష్మీనరసింహం, సీనియర్ అసిస్టెంట్ మురళీ, ఆర్‌ఐలు సిద్దేశ్వర్, రూప, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై అవగాహన

గోరంట్ల: స్థానిక బస్టాండ్ సర్కిల్ వద్ద గురువారం రెవెన్యూ అధికారులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలని వివరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

అమరాపురం: గ్రామ సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కారించాలని ఎంపీడీఓ మునిస్వామి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ఆయన మాట్లాడుతూ రోజూ విధులకు హాజరు కావాలన్నారు. అలాగే యూనిఫారం తప్పక ధరించాలన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సచివాలయంలో పరిష్కారం కాని వాటిని సంబంధిత ఉన్నతాధికారులకు పంపాలన్నారు.

హామీ ఇచ్చారు.. నెరవేర్చారు

- పింఛన్లను రూ.3 వేలకు పెంచిన ఘనత సీఎం జగన్‌దే
- హిందూపురం సమన్వయకర్త దీపిక

హిందూపురం అర్బన్: సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ.3 వేలకు పెంచారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీఎన్. దీపిక పేర్కొన్నారు. గురువారం హిందూపురం మండలం కిరికెర పంచాయతీ వీవర్స్ కాలనీలో వైఎస్సార్ పింఛన్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వివక్షకు తావులేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్మును విడతల వారీగా రూ.3 వేలకు పెంచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్, జెడ్పీటీసీ నాగభూషణం, కన్వీనర్ రాము, సర్పంచులు ఆనంద్, శ్రీనివాసరెడ్డి, సరస్వతి, ఆదెప్ప, ఎంపీటీసీలు కవిత, రామకృష్ణారెడ్డి, బాలచంద్ర, తిమ్మారెడ్డి, హనుమంతరెడ్డి, శ్రీరామిరెడ్డి, తిప్పేరుద్రయ్య, బసిరెడ్డి, హనుమంతరెడ్డి, రంగయ్య, జగదీష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: పాదయాత్రలో అవ్వాతాతలకు ఇచ్చిన రూ.3 వేల పింఛన్ హామీని జగన్ సంపూర్ణంగా నెరవేర్చారని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్బీకేలో వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచిన పింఛన్ కానుక రూ.3 వేలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ రామ్‌కుమార్, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు సంధ్య, లక్ష్మీపతిరెడ్డి, ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు హనుమంతరెడ్డి, దివాకర్‌రెడ్డి, నాయకులు సురేష్ కుమార్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ సదాశివరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శంకర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, హరి, షాకీర్, బాబేనాయక్ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం మండలం కిరికెర పంచాయతీలో పింఛన్ల మెగా చెక్కు ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త దీపిక

సందడిగా పింఛన్ల పంపిణీ..

మడకశిర: అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వు చూడడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో రూ.3000 చొప్పున లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాటను సీఎం జగన్ నిలబెట్టుకున్నారన్నారు. ఏటా రూ.250 చొప్పున పింఛన్ను పెంచుకుంటూ వచ్చారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అవ్వా తాతలకు రూ.3వేల చొప్పున పింఛన్ అందిస్తుండడం ఎంతో గొప్ప విషయమన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పింఛన్లు మంజూరు చేసే వారన్నారు. అయితే వైఎస్ జగన్ హయాంలో అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. ఓట్ల కోసం చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి మరోసారి ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యారన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వచ్చే ఎన్నికల్లో అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుట్టకామప్ప, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, ఎంపీడీఓ సోనిబాయి, స్థానిక నాయకులు సత్యనారాయణరెడ్డి, మంజునాథ్, బాలక్రిష్ణారెడ్డి, దొడ్డయ్య, జయరాజ్, అంజలి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం చురుగ్గా సాగింది. ప్రభుత్వం రూ.3వేలకు పెంచిన పింఛన్లను వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. దీంతో అవ్వ తాతలు, వితంతువులు, దివ్యాంగులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

పెనుకొండ: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఫింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారని నగర పంచాయితీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయితీ కార్యాలయ ఆవరణలో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో పింఛన్ అందుకోవాలంటే లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హత ఉంటే చాలు పింఛన్ మంజూరవుతోందన్నారు. వలంటీర్లు ఉదయం 5 గంటల నుంచే ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్‌లు అందజేస్తున్నారన్నారు. కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, ఎంపీపీ గీత, ముఖ్య నాయకులు రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయనరసింహ, కౌన్సిలర్లు సద్దాం, భాస్కర్‌నాయక్, శేషాద్రి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మడకశిరలో పింఛన్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ నళిని



చిలమత్తూరులో లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



పెనుకొండలో పింఛన్లు అందిస్తున్న చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్ తదితరులు

పనులు చేస్తున్న వారిని అడ్డుకోవద్దు

హిందూపురం: పారిశుధ్య పనులు చేస్తున్న పర్మినెంట్ మున్సిపల్ కార్మికులను ఎవరైనా అడ్డుకుంటే కేసులు నమోదు చేయడం జరుగుతుందని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం ఎస్‌బీఐ సర్కిల్ వద్ద పని చేస్తున్న పర్మినెంట్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్మికులు అడ్డుకున్నారు. పనులు చేస్తున్న వారిని అడ్డుకుంటున్నారని మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదుతో పోలీసులు రంగంలో దిగారు. పనులు చేసే కార్మికులకు రక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైన అడ్డుకునే ప్రయత్నం చేసినా.. కావాలనే చెత్తను రోడ్లపై పారబోయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. నిరసనలు, ఆందోళనలు చేయవచ్చు కానీ ఇలా ప్రజారోగ్యానికి ఇబ్బంది పెట్టే విధంగా చట్ట ఉల్లంఘన చేస్తే చర్యలు తప్పవన్నారు. పర్మినెంట్ వర్కర్లు ఎక్కడైనా ఆందోళనలో పాల్గొంటే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు.



కాంట్రాక్టు కార్మికులకు సర్దిచెబుతున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

సామాజిక తనిఖీపై 12న బహిరంగ సభ

అగళి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 12న సామాజిక తనిఖీపై బహిరంగా సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవిప్రసాద్, ఏపీఓ శివన్న గురువారం తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ఉపాధి సిబ్బంది, కూలీలు, మేట్లు హాజరు కావాలన్నారు.

టెన్త్ మోడల్ పేపర్ల పంపిణీ



విద్యార్థులకు మోడల్ పేపర్లను అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రొద్దం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు యూటీఎఫ్ నాయకులు మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి మోడల్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడతానికి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి మారుతి తెలిపారు. పాఠశాల హెచ్ఎం పద్మజ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

భూ హక్కు యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలి

హిందూపురం అర్బన్: ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసేలా రూపొందించిన భూ హక్కు యాజమాన్య చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం కోర్టు ఆవరణంలో నిరసన చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, హిదయతుల్లాఖాన్, న్యాయవాదులు సుదర్శన్, సత్యనారాయణ, సిద్ధూ, శ్రీరాములు, నాగరాజరెడ్డి, నాగప్ప, రామిరెడ్డి, వెంకటేష్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పరిగి: కొడిగెనహళ్లిలో కర్ణాటక మద్యం అమ్ముతున్న నరసమ్మ అనే మహిళను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. నిందితురాలి నుంచి 20 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

గోరంట్ల: పాలసముద్రంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న సుకన్య అనే మహిళను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. నిందితురాలి నుంచి 288 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద మద్యం తరలిస్తున్న ఓడీసీ మండలం చౌడంపల్లి వాసి ఆదినారాయణను పట్టుకున్నట్లు సీఐ చెప్పారు. 134 ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

రొద్దం: బూచర్ల గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష కార్యక్రమంలో భాగంగా భూ సర్వే పూర్తి కావడంతో రైతులకు గురువారం ఎంపీపీ చంద్రశేఖర్ పట్టాదారు పాసు పుస్తకాలు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ సమస్యల పరిష్కారానికి భూ హక్కు, భూ రక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. కార్యక్రమంతో రైతులకు ఎంతగానో మేలు జరుగుతోందన్నారు. సర్పంచ్ సోమిరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తున్న అధికారులు, నాయకులు

నాణ్యత లోపిస్తే చర్యలు

పెనుకొండ: పట్టణంలోని బాబయ్య ఉరుసులో నాణ్యత లేని ఖాజా విక్రయిస్తే చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ తస్లీమా వ్యాపారులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని బాబయ్య ఉరుసులో పలు ఖాజా దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులతో మాట్లాడుతూ రోజుల తరబడి నిల్వ ఉంచిన ఖాజాను విక్రయించరాదన్నారు. ఈగలు వాలకుండా, దుమ్ము ధూళి పడకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

బొలెరో బోల్తా



లేపాక్షి: మండలంలోని చోళసముద్రం వద్ద గురువారం ఉదయం హిందూపురం నుంచి కొడికొండ చెక్‌పోస్టుకు టమాట లోడుతో వెళుతున్న బొలెరో ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ఈ ఘటనలో టమాటాలు నేలపాలయ్యాయి. అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. రోడ్డు సమీపంలో ఉన్న టీ షాపు వద్ద మనుషులు లేకపోవడంతో ఇనుప రేకులు విరిగిపోయాయి.

రక్తహీనత లేని సమాజం నిర్మిద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ స్వరూప రెడ్డి

పరిగి: రక్త హీనత లేని సమాజాన్ని నిర్మిద్దామని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ స్వరూపరెడ్డి, రూబీ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యారోగ్య సిబ్బందితో న్యూమోనియాపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్త హీనతతో కలిగే నష్టాలను వివరించడంతో పాటూ నివారణోపాయాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన పెంచాలని సూచించారు. ఈసందర్భంగా మండల వ్యాప్తంగా వచ్చిన గర్భిణులకు వివిధ వైద్య పరీక్షలను నిర్వహించి, తగిన మందులను అందించారు. గర్భిణులకు దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు భోజనవసతి కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

మడకశిర: మండలంలోని వైబీహళ్లి పంచాయతీకి చెందిన కోడిపల్లిలోని టీడీపీ వార్డు మెంబర్ తిమ్మప్ప వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం పట్టణంలో జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు వారోత్సవ కార్యక్రమంలో ఆయన వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పుట్టకామప్ప, మండల కన్వీనర్ రామిరెడ్డి, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, స్థానిక నాయకులు మంజునాథ్, బాలక్రిష్ణారెడ్డి,దొడ్డయ్య తదితరులు ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చాలా బాగున్నాయని వార్డు మెంబర్ తిమ్మప్ప తెలిపారు. వైఎస్ జగన్ పాలన నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కష్టపడి పని చేస్తానన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వార్డు మెంబర్ తిమ్మప్ప

అంధుల ఆశాజ్యోతి ‘లూయిూ బ్రెయిలీ’

హిందూపురం: స్థానిక భవిత కేంద్రంలో గురువారం ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ప్రపంచ అంధుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. లూయిూ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకుని అంధులు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులైన టీచర్లు నాగార్జున, రిజ్వానాను సన్మానించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ లలిత, నందిని, బైసాని రాంప్రసాద్ రోటరీ క్లబ్ గిరీష్, ఎంజీఎం హెచ్ఎం సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఎంఈఓ–2 చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హసీనా, హరికృష్ణ ఐఆర్‌పీ తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఘనంగా లూయిూ బ్రెయిలీ దినోత్సవం

పెనుకొండ: పట్టణంలోని భవిత కేంద్రంలో గురువారం లూయిూ బ్రెయిలీ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ లూయిూ బ్రెయిలీ బ్రెయిలీ లిపిని రూపొందించి అంధులకు ఆశాజీవి అయ్యాడన్నారు. రాయడం, చదవడం ఎలాగో ఆరుచుక్కల పద్ధతి ద్వారా నేర్పారన్నారు. ఐఈఆర్‌పీ వెంకటరామిరెడ్డి, హెచ్ఎం రాధామణి, అనిల్‌కుమార్, వలీబా తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక భవిత కేంద్రంలో గురువారం ఘనంగా అంధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ ఎంఈఓ శ్రీధర్, ఉపాధ్యాయుడు నరసింహమూర్తి, ఐఈఆర్టీలు శిరీష, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

పరిగి: అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొడిగెనహళ్లి ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ కరీం తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తొలుత పాఠశాల ఆవరణలోని లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటూ ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ దివ్యాంగులలో దాగి ఉన్న ప్రతిభను సమాజానికి చాటేందుకే లూయిస్ బ్రెయిలీ బ్రెయిలీ లిపి ఆవిష్కరించారన్నారు. ఎంఈఓ శేషాచలం, ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ మురళీధర్ బాబు, డాక్టర్‌లు ఆఫ్తాబ్, వెంకటరమణారెడ్డి, షాషా తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

గుడిబండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. గురువారం మండలంలోని దేవరహట్టి, గుడిబండ గ్రామంలో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలసి ఆయన ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పన్ను వసూలు చేయండి

పావగడ: తిరుమణి సోలార్ కంపెనీలతో పన్ను వసూలు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా సంఘటన కార్యదర్శి ఎస్.రామాంజనప్ప గ్రామ పంచాయతీల పీడీఓలకు సూచించారు. స్థానిక ఆప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015–16లో తిరుమణి, వళ్లూరు, నాగలమడక గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటైన ఆసియాలోనే అతి పెద్దదైన సోలార్ పార్క్‌లో 10 ప్రైవేట్ సోలార్ కంపెనీలు సౌర శక్తిని ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. అలాంటి లాభదాయక కంపెనీలతో పన్ను వసూలు చేయడంలో పీడీఓలు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆ పంచాయతీల పరిధిలో సుమారు కోటి రూపాయలకు పైగా పన్ను వసూలు కావాల్సి ఉందన్నారు. అయితే సంబంధిత అధికారులు పన్ను వసూలు చేయడంలో నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారన్నారు. ఇప్పటికైనా పన్నులు వసూలు చేసి సోలార్ గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

అన్ని వర్గాలకూ లబ్ధి చేకూరాలి



మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

హిందూపురం టౌన్: యువత, మహిళలు, రైతులు, పేదలకు ఇలా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీకంఠపురం ఝాన్సీ లక్ష్మీబాయి మున్సిపల్ స్కూల్, కొట్నూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ లక్ష్యం అంత్యోదయ చిట్టచివరి మనిషికి కూడా సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున గౌడ్, అంజలి, కో–ఆప్షన్ నెంబర్ రత్నమ్మ, ఎంఈ వెంకటరమణ, డిఈ వాణి, ఏఈ జనార్దన్, బ్యాంకింగ్ రమణ, బీజేపీ నాయకులు పార్థసారధి, అమర్‌దేవేంద్ర, భాగ్యమ్మ, రవితేజారెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ‘జగనన్న ఆరోగ్య సురక్ష’

గుడిబండ: మండల కేంద్రంలోని అన్ని సచివాలయాల్లో రెండో విడుత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు గురువారం తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీడీ లక్ష్మీనారాయణ

రొద్దం: రొద్దం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఏపీడీ లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. పనుల నాణ్యత, కూలీల సంఖ్య, మస్టర్లను పరిశీలించారు. కూలీలు పనులను నాణ్యతగా చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన కూలి వస్తుందని ఏపీడీ చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీలో కూలీల సంఖ్య పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఏపీఓ రషీద్, టెక్నికల్ అసిస్టెంట్ నగేష్, ఫీల్డ్ అసిస్టెంట్ షామీర్ పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

రొళ్ల: దొమ్మరహట్టి, మారుతీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈఓ శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని వడ్డించాలన్నారు. స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

తక్షణ సాయం అందజేత

గోరంట్ల: కాలేకుంటపల్లిలో అంజినప్ప అనే వ్యక్తి అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. సర్పంచ్ వినోద్, సచివాలయ కార్యదర్శి సోనియా వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మీనారాయణరెడ్డి, వేల్ఫేర్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన రహదారుల్లో ఉన్న కళాశాలలు, పాఠశాలల ఎదుట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వామపక్ష పార్టీ నాయకులు, ఐఖ్య విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు గురువారం ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాసులకు వినతి పత్రం అందించారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరిపాళ్యం, రాంపురం, మునిమడుగులో గురువారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.